క్లుప్తంగా

కమనీయం.. సత్యదేవుని కల్యాణం



మద్ది సాధు మఠంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

పద్మనాభం: మండలంలోని మద్ది సాధు మఠంలో రమా సహిత వీర వెంకట సత్యనారాయణ స్వామి వారి కల్యాణం గురువారం రాత్రి వైభవంగా జరిగింది. సామవేదం బదరికా వాసు వేదమంత్రోచ్ఛరణలతో కల్యాణం సాగింది. కార్యక్రమంలో మద్ది సర్పంచ్ దంపతులు బుగత సన్యాసమ్మ, సత్యనారాయణతో పాటు అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో తాటిచెట్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు తిమ్మాపురం రామానాయుడు స్టూడియో సమీపంలో, తీరానికి ఆనుకుని ఉన్న తాటిచెట్లు అగ్నికి ఆహుతి అయ్యాయి. వివరాలివి.. ఈ ప్రాంతంలో పదుల సంఖ్యలో తాటిచెట్లు ఉన్నాయి. శుక్రవారం మధ్యాహ్నం సమయంలో ఒక్కసారిగా భారీగా మంటలు చెలరేగి, 20 తాటి చెట్లు బూడిద అయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు కొందరు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో, వెంటనే వారు సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రాంతంలో తరచూ ఇలాంటి అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి. ఎవరైనా ఉద్దేశపూర్వకంగా చెట్లకు నిప్పంటించారా లేదంటే ఎవరైనా సిగరెట్టు వంటివి వెలిగించి పడేయడంతో మంటలు వ్యాపించాయా అనేది తెలియలేదు.

సీపీఐ మహాసభలు జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు కానూరి రాంబాబు

తగరపువలస: ఈ నెల 10, 11 తేదీల్లో కంచరపాలెంలో జరగనున్న సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని భీమిలి ఏరియా నాయకుడు కానూరి రాంబాబు కోరారు. గుజ్జు రామునాయుడు భవన్‌లో శుక్రవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా 10వ తేదీన కంచరపాలెం నుంచి ఓల్డ్ ఐటీఐ జంక్షన్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. తరువాత జరిగే బహిరంగసభలో ముఖ్యఅతిథిగా రానున్న రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, సహాయ కార్యదర్శి దేవి సత్యంమూర్తి మాట్లాడతారన్నారు. సమావేశంలో భీమిలి నాయకులు మోర అప్పలరాజు, కొండపు ఈశ్వరరావు, రాంప్రైడి, నూలు ఆదినారాయణ, సన్నిబాబు, లక్ష్మణరావు, మావూరి వీర్రాజు తదితరులు పాల్గొని మాట్లాడారు.

గతుకులమయంగా మాస్టర్ ప్లాన్ రోడ్డు



గోతులమయంగా ఉన్న రోడ్డు

పీఎం పాలెం: స్థానిక కార్‌షెడ్ కూడలి నుంచి పీఎం పాలెం ఆఖరి బస్టాప్ వరకూ గల 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు గతుకులమయంగా ఉంది. జాతీయ రహదారి నుంచి పీఎం పాలెంలోని వివిధ కాలనీలకు వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి. ఈ రోడ్డు గతుకులతో ఉండడంతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్డు ప్రమాదాలు కూడా సంభవిస్తున్నాయి. సుమారు కిలోమీటరుకు పైగా పొడవు గల ఈ రోడ్డు నిర్వహణ పనులు అంతంతమాత్రంగా చేపట్టి, మమ అనిపిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ వేసవిలో గతుకులను పూడ్చకుంటే, రానున్న వర్షాకాలంలో గోతులు మరింత పెద్దవై ప్రమాదకరంగా మారతాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గ్రామీణులకు అందని ఆర్టీసీ సేవలు



తగరపువలస హైవే మీదుగా వెళ్తున్న సిటీ బస్సు

- ఆటోల్లో ప్రమాదకర ప్రయాణాలు
- సిటీ సర్వీసులు నడపాలని వినతులు

గ్రామీణులకు ఆర్టీసీ సేవలు అందడం లేదు. నియోజకవర్గంలోని పదుల సంఖ్యలో పంచాయతీలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో పలు గ్రామాల ప్రజలు ఆటోల్లో ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణాలు చేయవలసి వస్తోంది. నియోజకవర్గంలో మూడు మండలాలను కలుపుతూ డిమాండ్‌ను బట్టి సిటీ సర్వీసులు నడపాలని గ్రామీణులు కోరుతున్నారు.



తగరపువలసలో బస్సు డిపో పేరుతో ఆర్టీసీ అధికారులు పెట్టిన బోర్డు

తగరపువలస: భీమిలిలో చాలా రూట్లలో ఆర్టీసీ బస్సులు తిరగకపోవడంతో ప్రయాణికులు, విద్యార్థులు, వ్యాపారులు, మత్స్యకారులు, కార్మికులు, ఉద్యోగులకు ప్రైవేట్ రవాణాయే దిక్కవుతోంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఆటో, ట్యాక్సీ, క్యాబ్‌లను ఆశ్రయించి డబ్బులు వదిలించుకోవలసి వస్తోంది.

నియోజకవర్గం చాలా వరకు జీవీఎంసీ పరిధిలో ఉంది. అయితే, జాతీయరహదారి, ప్రధాన రహదారులలో తప్ప సిటీ బస్సులు అందుబాటులో లేవు. గతంలో విశాఖ ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఆనందపురం, కాపులుప్పాడ, తాటితూరు, చిన్నాపురం, పెదనాగమయ్యపాలెం, అన్నవరం గ్రామ పంచాయతీలకు బస్సులు నడిచేవి. ఆ సర్వీసులను పునరుద్ధరించాలని ఆయా గ్రామాలవాసులు కోరుతున్నారు. అలాగే మత్స్యకార గ్రామాలను అనుసంధానం చేస్తూ ఫిషింగ్ హార్బర్, విజయనగరం జిల్లాలోని కోనాడ, చింతపల్లికి బస్సులు నడపాలంటున్నారు. తగరపువలస–భీమిలి మధ్య షటిల్ సర్వీసులు, విశాఖ, విజయనగరం నుంచి తగరపువలస మీదుగా భీమిలికి డిమాండ్ ఉన్నా ఆర్టీసీ అధికారులు ఎందుకో పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

సరిపడినన్ని బస్సులేవీ?

గత పదేళ్లలో భీమిలి నియోజకవర్గంలో పరిశ్రమలు, విద్యాసంస్థలు, ఆస్పత్రులు బాగా వృద్ధి చెందాయి. వీటిలో ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో విస్తరించాయి. అయా వర్గాల ప్రజలు కూడా పట్టణ పరిధి కంటే గ్రామాలలోనే నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో ఉత్తరాంధ్ర నుంచి విద్యార్థులు, పేషెంట్లు, రైతులు, వ్యాపారులు, కార్మికులు ఇటువైపే రాకపోకలు సాగిస్తున్నారు.

‘దబ్బంద’ బస్సు పునరుద్ధరించాలి

గత ప్రభుత్వంలో ఆనందపురం మండలం మామిడిలోవ పంచాయతీ దబ్బందకు బస్సు సౌకర్యం కల్పించినా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ బస్సు ఆగిపోయింది. ఆ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతున్నారు. వాస్తవంగా కరోనా తరువాత చాలా వరకు బస్సుల సంఖ్య తగ్గిపోవడమో, ట్రిప్పులు కుదించడమో జరిగిందని అంటున్నారు. మిగిలిన రవాణా సాధనాలతో పోలిస్తే ఆర్టీసీ బస్సుల్లో చార్జీలు చౌకగా, ప్రయాణం భద్రంగా ఉన్నందున గతంలో నిలిచిపోయిన బస్సులతో పాటు మిగిలిన ప్రాంతాలకు దశలవారీగా బస్సులు నడపాలని గ్రామీణులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పంచాయతీలను కలుపుతూ బస్సు నడపాలి



ఆనందపురం మండలం చాలా పెద్దది. మా మండలంలో బస్సులు పెందుర్తి జాతీయ రహదారి లేదా నీళ్లకుండీల మార్గంలో ఎక్కువగా వెళ్తుంటాయి. గతంలో ఆనందపురం గ్రామంలోనికి బస్సు వచ్చేది. తరువాత నిలిపివేశారు. మధురవాడ మాదిరిగా మండలంలో అన్ని పంచాయతీలను కలుపుతూ సిటీ బస్సులు నడపాలి.

– చందక సన్యాసప్పుడు, ఆనందపుర

శివారు ప్రాంతాలకు ఆటోలే శరణ్యం

మండలంలో శివారు ప్రాంత పంచాయతీవాసులు ఇప్పటికీ బస్సు ముఖమే ఎరుగరు. చాలా వరకు ఆటోలను ఆశ్రయించి ప్రమాదకరమైన పరిస్థితులలో ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. కనీసం ఉదయం, సాయంత్రం వేళల్లో అయినా రెండేసి ట్రిప్పులు బస్సులు నడపడం వలన సౌకర్యంగా ఉంటుందని వారు కోరుతున్నారు.



గ్రామీణ ప్రాంతాలకు ఆటోలే గతి

తాటితూరు బస్సు తీసేశారు



గతంలో భీమిలి మండలం తాటితూరు నుంచి విశాఖకు 222టీ సిటీ బస్సు ఉండేది. ఇది తాటితూరు చుట్టూ ఉన్న ఎనిమిది పంచాయతీలకు సౌకర్యంగా ఉండేది. నైట్ హాల్ట్ కూడా ఉండేది. ఈ బస్సు లేకపోవడంతో ప్రైవేట్ విద్యాసంస్థలకు బస్సు ఫీజుల కింద వేలకు వేలు వదిలించుకుంటున్నారు. రైతులు, కూలీలకు కూడా ఈ బస్సు అందుబాటులో ఉండేది.

– రవ్వ ఈశ్వరరావు, తాటితూరు

తగరపువలస మీదుగా ఉంటే మేలు



విశాఖ, విజయనగరం నుంచి వచ్చే బస్సులు ఉత్తరాంధ్ర ముఖద్వారంలో ఉన్న తగరపువలస మీదుగా నడపాలి. నియోజకవర్గానికి సంబంధించిన ఎక్కువ కార్యాలయాలు భీమిలిలోనే ఉన్నాయి. వీలైతే భీమిలి నుంచి తగరపువలస మీదుగా సింహాచలం, అనకాపల్లి ప్రాంతాలకు బస్సులు నడపాలి.

– నరగడ శివాంజనేయరెడ్డి, చిల్లపేట

బాల్య వివాహాల వల్ల అనర్థాలు



కిశోర బాలికలకు అవగాహన కల్పిస్తున్న భీమిలి పీవో శ్రీదేవి

తగరపువలస: బాల్య వివాహాల వల్ల ఎన్నో అనర్థాలున్నాయని ఐసీడీఎస్ భీమిలి పీవో శ్రీదేవి తెలిపారు. యుక్త వయసు వచ్చాకే ఆడపిల్లలకు పెళ్లి చేయడం శ్రేయస్కరమని చెప్పారు. భీమిలి మండలం దాకమర్రి అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు. బాల్య వివాహాల వల్ల బాలికల్లో ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తుతాయన్నారు. సూపర్‌వైజర్ రేఖావాణి, ఏఎన్ఎం మాణిక్యం కిశోర బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ పోక్సో చట్టం, పౌష్టికాహారం, వేధింపులు తదితర అంశాల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో దాకమర్రి, నీలయమ్మసత్రం, ముద్దాడపేట, బోడమెట్టపాలెం అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి, కృష్ణవేణి, నారుతల్లి, కె.లక్ష్మి, పి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం



కుట్టు శిక్షణ కేంద్రంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

తగరపువలస: భీమిలి మండలం మజ్జివలసలో 16 పంచాయతీలకు చెందిన మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ఇటీవల బీసీ కార్పొరేషన్ ద్వారా పేర్లు నమోదు చేయించుకున్న వారందరికీ ఇక్కడ ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారని తెలిపారు. కుట్టు మిషన్లు కూడా ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, ఉప సర్పంచ్ నీలాపు సూర్యనారాయణ, ఎంపీడీవో హనుమంతరావు, పంచాయితీ విస్తరణ అధికారి సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుని కుమార్తె చదువుకు రూ.50వేల సాయం



భవ్యశ్రీ చదువు నిమిత్తం రూ.50వేలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

తగరపువలస: స్నేహితుడి కుమార్తె చదువుకు ఆర్థిక సహకారం అందించి ఆదర్శంగా నిలిచారు చిట్టివలస జెడ్పీ హైస్కూల్ 1992 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు. కొమ్మ సీతారాం కుమార్తె భవ్యశ్రీ శ్రీబాసర విద్యాసంస్థల్లో ఇంటర్మీడియెట్ చదువుతోంది. సీతారాం మరణించడంతో భవ్యశ్రీ చదువుకు చేయూతనిచ్చేందుకు ముందుకొచ్చింది మిత్ర బృందం. పూర్వ విద్యార్థుల్లో ఒకరైన జగుపల్లి సూరిబాబు రూ.50 వేలను సమకూర్చారు. దీంతో భవ్యశ్రీకి ఇంటర్మీడియెట్ రెండేళ్లకు (2024–26 విద్యా సంవత్సరాలకు) ఫీజులు చెల్లించి, ఆ రసీదులను శ్రీబాసర విద్యాసంస్థల చైర్మన్ పూడి రమేష్‌కు అందించారు. కార్యక్రమంలో 1992 బ్యాచ్ జెడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు హేమ, మద్దిల సుబ్బారావు, పిట్ట రఘు శ్రీనివాస్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ ఏడేళ్లుగా తమ బ్యాచ్ విద్యార్థుల సహకారంతో స్నేహితుల ఆరోగ్య సమస్యలు, మరణించిన వారి పిల్లల చదువుల నిమిత్తం ఆర్థిక సాయం చేస్తున్నట్టు తెలిపారు.

మారుతీప్రసాద్‌కు ఘన సత్కారం



మారుతీ ప్రసాద్‌ను సత్కరిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

మధురవాడ: ‘కళారూపాలు బాగుండాలి.. కళాకారులు ఆదరించబడాలి’ అన్న సత్సంకల్పంతో తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ ఆంధ్ర, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాలలోని కళాకారులను బాహ్య ప్రపంచానికి పరిచయం చేయడం కోసం కళాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో భాగంగా శుక్రవారం మధురవాడలో విశాఖ ఉషారాణి కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు, రంగస్థలంలో నంది అవార్డు గ్రహీత అయిన వంకాయల మారుతీ ప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. దుశ్శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సన్మానించారు. కార్యక్రమంలో ట్రస్ట్ వ్యవస్థాపకుడు అంజనప్ప, గౌరవాధ్యక్షుడు సామవేదం బాలసుబ్రమణ్యం, కళాభిషేకం డైరెక్టర్ పెద్దరికం సాయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కళాకారులకు మారుతీప్రసాద్ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హార్మోనిస్ట్ ముంతా లక్ష్మణరావు, ఎంఎస్ నాయుడు, ఎం.శంకరరావు, ఇతర కళాకారులు పాల్గొన్నారు.

టీడీపీలో కుమ్ములాటలు



బుజ్జిని విచారిస్తున్న ఎస్ఐ భాస్కరరావు

మధురవాడ: పీఎం పాలెం టీడీపీ నాయకుల్లో ఇంత వరకు నివురు గప్పిన నిప్పులా ఉన్న విభేదాలు వార్డు అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో బహిర్గతమయ్యాయి. వివరాలివి.. గతంలో విశాఖ జిల్లా యూత్ బీసీ విభాగం మాజీ కార్యదర్శిగా పనిచేసిన ఎస్ఎస్ఎన్ స్వామి (బుజ్జి), జీవీఎంసీ 6వ వార్డు టీడీపీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ గ్రూపుల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఇందులో భాగంగా తనపై వాట్సాప్ గ్రూపులో కించపరుస్తూ బుజ్జి మెసేజ్‌లు పెట్టాడని వార్డు అధ్యక్షుడు శ్రీనివాస్ పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ భాస్కరరావు బుజ్జిని శుక్రవారం స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ తాను 20 ఏళ్లుగా టీడీపీ కోసం పనిచేస్తున్నానని, దాసరి శ్రీనివాస్ పార్టీని నమ్ముకుని ఉన్న వారిని పక్కన పెట్టి గతంలో అవంతి వెనుక ఉండి ఇప్పుడు పార్టీలోకి వచ్చిన వారిని వెనుక తిప్పుకుంటూ వారికి ప్రాధాన్య ఇస్తున్నాడని అన్నారు. పార్టీ కోసం శక్తి వంచన లేకుండా పని చేస్తున్న తమకు గాని, తమ కులానికి చెందిన వారికి పార్టీలో ఎటువంటి ప్రాధాన్యత లేకుండా పోతుందని ఇటువంటి విషయాలు ప్రశ్నించినందుకే తనపై తప్పుడు ఫిర్యాదు ఇచ్చాడని ఆరోపించారు. తాను ఫిర్యాదు స్టేటస్ తెలుసుకోవడానికి స్టేషన్‌కి వెళ్తే సరైన సమాచారం ఇవ్వలేదని వాపోయారు.

అనంతుని పేరిట త్వరలో యాప్

రూపకల్పనకు ముందుకొచ్చిన హైదరాబాద్ వాసి



సీఈవో అనూషను సన్మానిస్తున్న నగేష్, నగేష్ కుమార్

పద్మనాభం: అనంత పద్మనాభ స్వామి పేరు మీద యాప్ రూపొందించనున్నట్లు హైదరాబాద్‌కు చెందిన వసుధైక విజనరీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సీఈవో అనూష ప్రకటించారు. పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయాన్ని శుక్రవారం ఆమె దర్శించుకుని, స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ స్వామి విశిష్టతను భక్తులకు తెలిసేలా మొబైల్ యాప్ రూపొందించి, ప్రచారం చేస్తామన్నారు. యాప్ రూపొందించేందుకు రూ.3లక్షల నుంచి 5 లక్షల వరకు ఖర్చవుతుందన్నారు. ఆలయంలో జరిగే పూజా కార్యక్రమాలను యాప్‌లో పొందుపరుస్తామన్నారు. అనూషను ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు కె.నగేష్ కుమార్, వెలుగు నాడు విద్యుత్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వేదుల నగేష్ సన్మానించారు. అనూషను ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఈవో నానాజీ బాబు అభినందించారు.

అనంతుని ఆలయానికి శిఖర శోభ

- శాస్త్రోక్తంగా విమాన శిఖర ప్రతిష్ట
- ఘనంగా ముగిసిన ఉత్సవాలు



గిరిపై పూర్ణకలశంతో అనంత పద్మనాభ స్వామి ఆలయం

పద్మనాభం: అనంత పద్మనాభస్వామి ఆలయం శిఖరంతో శోభాయమానంగా దర్శనమిచ్చింది. పద్మనాభంలోని గిరిపై ఐదు రోజుల నుంచి జరుగుతున్న శిఖర ప్రతిష్ట ఉత్సవాలు శుక్రవారంతో ఘనంగా ముగిశాయి. ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అగ్ని ధ్యానం, అంత హోమం, పూర్ణాహుతి తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అనంత పద్మనాభ స్వామి విమాన శిఖరాన్ని పండితుల వేద మంత్రోచ్చరణల నడుమ ప్రతిష్ఠించారు. తదుపరి శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి విగ్రహాలకు శాంతి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో నిధులు మంజూరు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన సీజీఎఫ్ నిధులు రూ.60 లక్షలతో నిర్మించిన శిఖర ప్రతిష్ట శిలా ఫలకాన్ని భీమునిపట్నం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శుక్రవారం ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన నాబార్డు నిధులు రూ.5కోట్లతో నిర్మించిన అనంతుని బీటీ రోడ్డును గంటా ప్రారంభించారు.

త్రివిధ దళాలకు అనంతుని ఆశీస్సులుండాలి

అనంత పద్మనాభ స్వామి ఆలయ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్నశ్రీను) కోరారు. గిరిపై అనంత పద్మనాభ స్వామిని ఆయన దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉగ్రవాదులను అంతమొందించేందుకు త్రివిధ దళాలకు అనంత పద్మనాభుని ఆశీస్సులు మెండుగా ఉండాలని ప్రార్థించారు.



పూర్ణ కలశాన్ని ప్రతిష్టిస్తున్న అర్చకులు

దర్శించుకున్న కేకే రాజు

అనంత పద్మనాభుని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు దర్శించుకున్నారు. యాగశాలలో పూజలు చేశారు.

స్వామిని దర్శించుకున్న వారిలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర బంగారప్పుడు, సిరుగుడి ఆదినారాయణ, సుంకర నారాయణరావు, బుగత సత్యనారాయణ, ఉత్సవ కమిటీ సభ్యులు తాలాడ పద్మనాభం, కాళ్ల నగేష్ కుమార్, రూపాకుల రవి కుమార్, జెట్పీటీసీ మాజీ సభ్యుడు కళిరెడ్డి దామోదరరావు, అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు ఉన్నారు.



యాగశాలలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు



ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు



శిఖర ప్రతిష్ట శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు



అనంత పద్మనాభ స్వామిని దర్శించుకునేందుకు వేచి ఉన్న భక్తులు

నరసింహ చతుర్దశి రేపు

కొమ్మాది: బీచ్ రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం శ్రీ నరసింహ చతుర్దశి ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబదాస్ ప్రభుజీ ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు తెల్లవారుజామున 4.30 గంటలకు స్వామివారి దర్శనం, 8 గంటలకు దర్శన హారతి, గురుపూజ, అనంతరం రాధా దామోదరుడికి వివిధ పుష్పాలతో అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

‘పాకిస్తాన్‌కు కోలుకోలేని దెబ్బ ఖాయం’

తగరపువలస: పహల్గాంలో 26 మంది పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను భారత సైన్యం హతమారిస్తే పాకిస్తాన్ ఇంకా వారికి వత్తాసు పలుకుతోందని చిట్టివలస జ్యూట్‌మిల్లు కాంగ్రెస్ కార్మిక సంఘం నాయకులు విమర్శించారు. తమ దేశ భవిష్యత్తును పట్టించుకోకుండా యుద్ధానికి కవ్విస్తోందన్నారు. శుక్రవారం వారి కార్యాలయంలో వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడారు. భారత్‌తో ఎన్ని యుద్ధాలు చేసినా పాకిస్తాన్‌కు బుద్ధి రాలేదన్నారు. ప్రధాని మోదీ ఆధ్వర్యంలో త్రివిధ దళాలు దాయాది దేశమైన పాకిస్తాన్‌ను మరోమారు కోలుకోలేని దెబ్బ తీస్తాయన్నారు. సమావేశంలో కై లాసరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, గొండేల అప్పారావు తదితరులు మాట్లాడారు.

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు

విశాఖ విద్య: పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూజీ, పీజీ పరీక్షల్లో కొంతమంది విద్యార్థులు అనైతికమైన చర్యలకు పాల్పడటం, మాల్ ప్రాక్టీస్ చేసినట్లు వర్సిటీ అధికారుల దృష్టికి వచ్చిందన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏయూ పరీక్షలకు సంబంధించిన నియమావళికి అనుగుణంగా త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. ఏయూ పరిధిలో కొద్ది రోజులుగా జరుగుతున్న పరీక్షలను ప్రత్యేకంగా నియమించిన తనిఖీ బృందాలు, ప్రత్యేక పరిశీలకులు నిరంతరం పర్యవేక్షణ, పరిశీలన చేసి పరీక్షా కేంద్రాల్లో కొంతమంది విద్యార్థులు చీటీలు పెట్టి రాయడం, పుస్తకాల్లో చూసి రాయడం, మొబైల్ ఫోన్‌లో చూసి రాయడం వంటి చర్యలకు పాల్పడడాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఇటువంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని పరీక్షల విభాగానికి వీరిపై నివేదికను పరీక్షల తనిఖీ అధికారులు పంపారు. మాల్ ప్రాక్టీస్‌కి పాల్పడిన విద్యార్థులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడిన విద్యార్థుల పరీక్షను రద్దు చేయడం, నిర్దిష్ట కాలం పాటు వారు పరీక్ష రాయకుండా నిషేధించడం, ఇటువంటి చర్యలను ప్రోత్సహించిన కళాశాల యాజమాన్యం, సిబ్బంది పైన క్రమశిక్షణ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.